జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం | 4 | నవంబర్ | 2024 • పేజీలు : 5

## గ్రేస్ మిషన్ హై స్కూల్లో..
# విషాదం

- ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తో ఇద్దరు సెక్యూరిటీ గార్డ్స్ దుర్మరణం





2 లో..





- తల తాకట్టు పెట్టైనా డిసెంబర్లో రుణమాఫీ చేస్తాం
- మాయమాటలు చెప్పే సాంప్రదాయం లేదు
- త్వరలోనే స్మార్ట్ కార్డులు
- రూ. 7 లక్షల కోట్లు అప్పులు చేసిన ఘనత బిఆర్ఎస్ దే
- మరో 10 ఏళ్లు ఇందిరమ్మ రాజ్యానిదే అధికారం
- 6 నుంచి రాష్ట్రంలో కులగణనకు శ్రీకారం
- పేదలకు గూడు, విద్య, వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- సెంచరీ కొడతామని పగటి కలలు కంటున్నా మాజీ మంత్రులు
- కేటీఆర్ పాదయాత్రను స్వాగతిస్తున్నాం
- దోచుకున్న డబ్బులను పంచుకుంటూ రావాలి
- ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ప్రజా పాలన
- ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారంలో మంత్రులు పొంగులేటి, తుమ్మల

# పథకాలు ఎగ్గొట్టే నైజాం మాది కాదు...

**ఇల్లందు, నవంబర్ 3, ప్రజాజ్యోతి:**

ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పథకాలను ఎగ్గొట్టే నైజం తమది కాదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఆదివారం ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తల తాకట్టు పెట్టైనా డిసెంబర్లో రైతులకు రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు మాయమాటలు చెప్పే సాంప్రదాయం తమ ప్రభుత్వానికి లేదని, అలా మాయ మాటలు చెప్పి రెండు పర్యాయాలు రాష్ట్రంలో అధికారంలోకి ఎవరు వచ్చారో తెలుసునని ఎద్దేవా చేశారు. త్వరలో రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గత పది హేను రాష్ట్రాన్ని పరిపాలించిన టిఆర్ఎస్ ప్రభుత్వం రూ. 7 లక్షల కోట్ల అప్పులను చేసిందని, ఏ శాఖలో చూసిన అప్పులు మిగిలాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీ నెరవేర్చేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని, మరో 10 ఏళ్లు తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యాన్నిధి అధికారం అని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన ఈనెల 6 నుండి రాష్ట్రంలో కొనసాగడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని పేదలకు గూడు విద్య వైద్యం అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన

మిగతా 2 లో...



# వేగానికి... కళ్లెం వేయాల్సిందే..



- యువత ర్యాష్ డ్రైవింగ్
- మితిమీరిన వేగంతో పొంచి ఉన్న అనర్థాలు
- నియంత్రణ కోల్పోయి పెరుగుతున్న ప్రమాదాలు
- అతివేగమే ప్రమాదకరం అంటున్న నిపుణులు

**భద్రాచలం, నవంబర్ 3, ప్రజాజ్యోతి:**

రోడ్డు ప్రమాదం ఒకటి చాలు ఓ కుటుంబం కుమిలిపోవడానికి, తల్లిదండ్రులకు పుత్రశోకం మిగిల్చడానికి, ఓ సంసారం రోడ్డున పడడానికి, ఇటువంటి ప్రమాదాల నివారణకు ఆటు పోలీసులు, ఇటు రవాణాశాఖ అధికారులు ఎంతగా అవగాహన కల్పిస్తున్నా నియంత్రణ కష్ట సాధ్యమవుతుంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల

మిగతా 2 లో...

# రెచ్చిపోతున్న... సైబర్ నేరగాళ్లు...



- లింక్ ఓపెన్ చేస్తే ఫోన్ హ్యాక్
- సైబర్ నేరగాళ్ల చేతులోకి ఫోన్
- వాట్సాప్ లో సదరు వ్యక్తి ప్రమేయం లేకుండానే ఫార్వర్డ్
- పియం కిసాన్ పేరుతో చక్కర్లు
- జాగ్రత్తగా ఉండాలంటున్న పోలీసులు

**ఇల్లందు, నవంబర్ 3, ప్రజాజ్యోతి:**

సైబర్ నేరాలకు ప్రస్తుత కాలంలో వివిధ సామాజిక మాధ్యమాల్లో లింకులను పోస్టు చేసి సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారనే చెప్పొచ్చు. కేటుగాళ్లు రోజుకు ఒక కొత్త పంథాను ఎంచుకుంటున్నారు. ఇంకా మరొక రకమైన స్కామ్ వెలుగులోకి వచ్చింది. వాట్సాప్ లలో వచ్చే లింక్ ఓపెన్ చేస్తే ఇక ఫోన్ హ్యాక్ అవుతుంది. గతంలో మీ అకౌంట్ వెరిఫికేషన్ చేస్తున్నామని, బ్యాంక్ అధికారులు మాట్లాడుతున్నామని, మీ అకౌంట్ కు లింక్ అయి ఉన్న ఫోన్ కు ఓటీపీ వస్తుందని, అది చెబితే మీ ఎకౌంట్ సెట్ అవుతుందని చెప్పడంతో ఎంతోమంది మోసపోవడం మనం విన్నాం.. చూశాం. ఇదే తరహాలో మీకు బ్యాంకు లోన్ మంజూరు అయిందని, మీకు కొరియర్ లో ఆర్డర్ వచ్చిందని, మీకు రూ. వేలు వస్తాయని, ట్రేడింగ్ పేరుతో సైబర్ కేటుగాళ్ళ వలలో ఎందరో పడి ఆర్థికంగా

మిగతా 2 లో...

# పథకాలు ఎగ్గొట్టే నైజాం మాది కాదు

(మొదటి పేజీ తరువాయి...)

లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని, మరల ఎన్నికలు వస్తే సెంచరీ కొడతామని మాజీ మంత్రులు పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కేటీఆర్ పాదయాత్ర చేయాలని నిర్ణయించుకోవడాన్ని స్వాగతిస్తున్నామని, పాదయాత్ర చేస్తే ఆరోగ్యం బాగుంటుందని సూచించారు. గత ప్రభుత్వంలో రూ లక్షల కోట్లను దోచుకున్నారని, అలా దోచుకున్న డబ్బులను పాదయాత్రలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీకి పంచుకుంటూ రావాలని కోరారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల రూ. లక్షల కోట్ల అప్పుల్లో కూరుకు పోయినప్పటికీ, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో పదేళ్లు విసిగి వేసారి రాష్ట్ర ప్రజల ఆశీర్వాదం మేరకే ఇందిరమ్మ రాజ్యం ఏర్పాటు కావడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంపై ఎన్ని అపనిందలు, ఆరోపణలు చేసినా గాని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. గత ప్రభుత్వంలో అర్హులైన పేదలకు తెల్ల రేషన్ కార్డులు ఇచ్చిన దాఖలాలు లేవని, కేవలం ఉప ఎన్నికలు వచ్చిన ప్రాంతాల్లో మాత్రమే తెల్ల రేషన్ కార్డులు, పింఛన్లు ఇచ్చి ప్రజలను రాజకీయంగా వాడుకున్నారని విమర్శించారు. స్మార్ట్ కార్డు ద్వారా రేషన్ కార్డు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకే గ్యాస్, ఇందిరమ్మ ఇండ్లు, రూ. 2 లక్షల రుణమాఫీ, హెల్త్ కార్డులకు ఉపయోగపడతాయని తెలిపారు. అదే విదంగా స్మార్ట్ కార్డులను ఇంటి వద్దకే వచ్చి ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్ర బడ్జెట్లో ఇందిరమ్మ ఇండ్లకు రూ 72 వేల కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఇచ్చిన హామీ మేరకు రూ. 18 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేయడం జరిగిందని, మిగిలిన రూ. 13 వేల కోట్ల రుణమాఫీని డిసెంబర్లో పూర్తి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇండ్లు అని, ప్రస్తుత ప్రభుత్వంలో ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ గృహాలను ఇవ్వడం జరుగుతుందని, అవసరమైతే గిరిజన ప్రాంతాలలో నియోజకవర్గానికి 15000 అయినా కేటాయిస్తామని స్పష్టం చేశారు. మరో 4 ఏళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లకు తగ్గకుండా ఇస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన, దళిత, ప్రజల కోసం దుబారా ఖర్చులను తగ్గించుకుంటూ ప్రజాపాలన కొనసాగిస్తు ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. రూ. వేలాది కోట్లు ఖర్చుపెట్టి భవనాలు కట్టుకోవాలని ఆలోచన లేదని స్పష్టం చేశారు. కార్పొరేట్ విద్య తరహాలో రాష్ట్రంలో 300కు పైగా రూ. 120 నుంచి రూ. 150 కోట్లతో ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటుకు శంకుస్థాపనలు చేసుకోవడం జరిగిందన్నారు. గత 10 ఏళ్ల నుంచి బిఆర్ఎస్ అగ్రనేతలు జనంలోకి రాలేదని, నాలుగు గోడల మధ్య కూర్చుని ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. గత ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర కష్టాలు తెలియని మీకు ప్రజలు జ్ఞానోదయం చేశారని గుర్తు చేశారు. పేదవారి కన్నీళ్లు తుడిచేది కాంగ్రెస్ ప్రభుత్వం అని స్పష్టం చేశారు. రూ. 331 కోట్ల ఎల్ డబ్ల్యూ ఈ నిధుల ద్వారా గిరిజన ప్రాంతాల్లో రోడ్ల పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేశామని, రూ. 2 లక్షలకు పైబడిన వారికి రుణమాఫీ చేసే బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. త్వరలో రైతు భరోసా పథకం ద్వారా రూ. 7500 ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులు పండించిన పంటలను యంఎస్పి దొరికే మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ జెడిఎ నరేందర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, డైరెక్టర్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఇల్లందు, పినపాక, వైరా, భద్రాచలం ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, మాలోతు రాందాస్ నాయక్, తెల్లం వెంకట్రావు, ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, మాజీ మార్కెఫెడ్ వైస్ చైర్మన్ బుర్ర రాజశేఖర్, మైబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు భరత్ చందర్ రెడ్డి, ఇల్లందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీ పాషా, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ అనసూయ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పులిగళ్ళ మాధవరావు, డిసిసిబి డైరెక్టర్లు మేకల మల్లిబాబు, జనగం కోటేశ్వరరావు, ఐఎన్టియుసి ఉపాధ్యక్షుడు జె. వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా నాయకులు ఏలూరి కోటేశ్వరరావు, పిఎసిఎస్ చైర్మన్ మెట్ల కృష్ణ, మాజీ ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, హరి హర క్షేత్ర ఆలయ కమిటీ చైర్మన్ గందె సదానందం, ఇల్లందు పట్టణ, మండల అధ్యక్షులు దొడ్డ డానియల్, పులి సైదులు, నాయకులు మడుగు సాంబమూర్తి, భోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, జాఫర్, సుదర్శన్ కోరి, గాలిపల్లి సరూప, గోచికొండ శ్రీదేవి, పత్తి రంజిత్, జాటోత్ ఝాన్సీరాణి, కంబాల ముసలయ్య, దేవా నాయక్, ఆరేం కిరణ్, కిన్నెర నర్సయ్య, రామారావు, మూల మధుకర్ రెడ్డి, పగడాల మంజుల, పింగళి నరేష్, దుర్గ ప్రసాద్, భూక్య నాగేశ్వరరావు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రేస్ మిషన్ హై స్కూల్లో విషాదం



*మణుగూరు, నవంబర్ 3, ప్రజాజ్యోతి:*

ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి గ్రేస్ మిషన్ హై స్కూల్లో ఇద్దరు సెక్యూరిటీ గార్డ్స్ మృతి చెందిన సంఘటనతో మణుగూరులో విషాదం నెలకొంది. మణుగూరులోని గ్రేస్ మిషన్ హై స్కూల్లో ఆదివారం తెల్లవారుజామున విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సెక్యూరిటీ గార్డులు ఉపేందర్, రత్నం స్కూల్ ప్రహరీ గోడ పై ఉన్న జెండాను తొలగిస్తుండగా 11కే.వి. సర్వీస్ వైర్ కు తగిలి విద్యుత్ షాక్ తో అక్కడికక్కడే మృతి చెందారు. మున్సిపాలిటీలోని శివలింగపురం, కాళీమాత ఏరియాల్లో నివా సం ఉంటున్నారు. విషయం తెలుసుకున్న మణుగూరు పోలీసులు డీఎస్పీ, సీఐలు సంఘటన స్థలాన్ని పరిశీలించి స్కూల్ యాజమాన్యం నుంచి వివరాలు తెలుసుకున్నారు.

**నిర్లక్ష్యంతోనే జరిగిందా..?**

స్కూల్ యాజమాన్యం నిర్లక్షంతోనే ప్రమాదం జరిగి ఉంటుంది అంటూ పలు పార్టీల నాయకులు, విద్యార్థి యూనియన్లు డిమాండు చేశారు. అదే సమయంలో మృతి చెందిన రత్నం, ఉపేందర్ కుటుంబ సభ్యుల రోదనలు ఆకాశాన్నంటాయి. 11 కేవీ సర్వీస్ వైరు పాఠశాల పక్క నుంచి పోతున్న విద్యార్థులు నిత్యం సంచరించే ప్రదేశంలో జెండాలు ఉంచడం వాటిని రాత్రి వేళ తొలగించే క్రమంలో ఇలా జరిగింది అనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**నాయకుల ఆరా...**

విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, సీపీఐ, సీపీఎం నాయకులు వేర్వేరుగా గ్రేస్ మిషన్ స్కూల్ కు చేరుకొని మృతదేహాలను సందర్శించి, ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. యాజమాన్యం బాధిత కుటుంబాలకు పరిహారం అందించాలని కోరారు. అనంతరం కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. తక్షణమే ప్రమాదంపై పూర్తి దర్యాప్తు చేయాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మణుగూరు సిఐ సతీష్ కుమార్ ని ఆదేశించారు. మృతదేహాలకు పోస్టుమార్టం చేసి బాధిత కుటుంబాలకు అప్పగించారు.

# రెండు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



*భద్రాచలం, నవంబర్ 3, ప్రజాజ్యోతి:*

భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్ లో గల ఓ రేషన్ షాప్ నుండి అక్రమంగా తరలిస్తున్న రెండు క్వింటాల రేషన్ బియ్యాన్ని ఆదివారం సాయంత్రం ఎస్ బి ఎస్ఐ శ్రీనివాస్ పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఆటో డ్రైవర్ రాజు అనే వ్యక్తి తన ఆటోలో భద్రాచలం శివారులో గల ఆంధ్రలోని ఎటపాక కు తరలిస్తుండగా ఆంధ్ర తెలంగాణ సరిహద్దు వద్ద రెండు క్వింటాళ్ల బియ్యంతో సహా ఆటోను పట్టుకున్నట్లు ఎస్ బి ఎస్సై శ్రీనివాస్ తెలియజేశారు.

# వేగానికి కళ్లెం వేయాల్సిందే!!

(మొదటి పేజీ తరువాయి...)

వేగం వలన ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఇటువంటి ప్రమాదాల్లో ప్రధానంగా యువత మృత్యువాత పడుతున్నారు. వీటిని నివారించడానికి యువత వాహనం నడిపే సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరమయ్యింది. రోజు రోజుకు మార్కెట్లో లోకి వస్తున్న కొత్తకొత్త మోడల్ బైకులు యువతను ఆకర్షిస్తున్నాయి. మారుమూల గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా యువత వీటిని కొనడానికి ఆసక్తి చూపుతున్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలపై ప్రేమతో వారి మాట కాదనలేక పిల్లలకు కు బైకులు ఇప్పిస్తున్నారు. ముఖ్యంగా యువత వేగాన్ని తగ్గించి, రోడ్డు నియమ నిబంధనలు పాటించాలి. స్పీడ్ కారణంగా జరుగుతున్న ప్రమాదాలపై యువతకు అవగాహన సదస్సులు పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ యువత లో మార్పు రావడం లేదు . ప్రమాదాల వల్లే కలిగే నష్టాలను తల్లిదండ్రులు వారి పిల్లలకు వివరించాలి. ఈ విషయాన్ని యువత గుర్తించేలా చేయాలి. ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ ధరించకపోవడం, మైనర్లు వాహనాలు నడపకుండా చూడడం, వంటి వాటిపై యువతలో చైతన్య పర్చి మార్పు వచ్చేలా కృషి చేయాలి. త్రిపుల్ రైడింగ్ హెల్మెట్ ధరించకపోవడం ఎంత ప్రమాదమో యువతకు వివరించాలి. పిల్లలు వాహనాలను ఎలా నడుపుతున్నారని తల్లిదండ్రులు గమనించి వారికి శిక్షణ ఇచ్చి క్రమశిక్షణతో ఉంచాల్సిన బాధ్యతను తల్లిదండ్రులు తీసుకోవాలి . అప్పు యువత వేగానికి కళ్లెం వెయ్యవచ్చు.

# రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు!

(మొదటి పేజీ తరువాయి...)

నష్టపోయిన దాఖలాలు కోకొల్లలు ఉన్నాయి. పోలీస్ శాఖ సైతం సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యవంతం చేస్తున్నకాని ఎక్కడో ఒకదగ్గర మోసపోతూనే ఉన్నారు అమాయక ప్రజలు..ఇక సైబర్ గేటుగాళ్లు మరొక కొత్త పంథాను ఎంచుకున్నారు. పీఎం కిసాన్ ఏపీకే యాప్ ను వాట్సాప్ గ్రూప్ లలో పోస్ట్ చేయడం జరుగుతుంది. ఈ ఏపీకేను ఓపెన్, డౌన్లోడ్ చేస్తే చాలు మీ ఫోన్ హ్యాక్ అయి సైబర్ నేరగాళ్ళ చేతుల్లోకి వెళ్తుంది. ఫోన్ హ్యాక్ కాగానే సదరు ఫోన్ వ్యక్తికి సంబంధం లేకుండా ఆ ఏపీకే యాప్ ను వాట్సాప్ గ్రూపులలో ఫార్వర్డ్ చేయడం జరుగుతుంది. గత రెండు రోజుల క్రితం ఓ వ్యక్తి తన ఫోన్ వాట్సాప్ లో వచ్చిన పిఎం కిసాన్ ఏపీకే యాప్ ను ఓపెన్ చేయడంతో ఆ ఫోన్ హ్యాకర్లు హ్యాక్ చేయడం జరిగింది. ఈ విషయాన్ని సంబంధిత పోలీసు అధికారులకు సైతం సమాచారం ఇచ్చినట్లు సదరు వ్యక్తి పేర్కొన్నారు. వాట్సాప్ గ్రూపులలో ఆ వ్యక్తికి సంబంధం లేకుండా పోస్టులు వెళ్లడం, దింతో ఆ వ్యక్తి ఫోన్ స్విచ్ ఆఫ్ ఉంచిన కానీ వాట్సాప్ గ్రూపులలో ఆ వ్యక్తి ఫోన్ నెంబర్ తోనే చక్కర్లు కొడుతున్నాయి. ఎట్టి పరిస్థితులలో వాట్సఅప్ గ్రూపులో వచ్చే పీఎం కిసాన్ ఏపీకెలను ఓపెన్, ఇన్స్టాల్ చేసుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు. అంతేకాకుండా ఇక ఆ ఫోన్ హ్యాకర్లు చేతులకు వెళ్లడంతో ఎకౌంటు సైతం ఖాళీ అయ్యే పరిస్థితి లేకపోలేదని తెలుపుతున్నారు. కాగా అసలు పీఎం కిసాన్ పథకంలో భాగంగా వారు ఎకౌంట్లో డబ్బులు పడని వారి వద్ద నుండి ఇలా ఏపీకే యాప్ లను వాట్సప్ గ్రూపులతో పాటు వివిధ సామాజిక మాధ్యమాల్లో పంపడం జరుగుతుంది. గతంలో సైతం రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత విద్యుత్ రాని వారి కోసమేనని ఇలాంటి ఏపీకే యాప్ లను ఇన్స్టాల్ చేసుకుని కేవైసీ చేయాలని సైబర్ నెరగాళ్లు లింకునను పంపినట్లు తెలుస్తుంది. అదేవిధంగా ఎస్బిఐ క్రెడిట్ కార్డు వినియోగించేవారికి రివార్డ్ పాయింట్స్ రావడం జరుగుతుంది. ఇదే అదునుగా భావించిన సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియాలో పోస్టులను పెట్టి చాలామంది అమాయక ప్రజల వద్ద నుండి భారీ స్థాయిలో నగదు దోచుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఇలాంటి ప్రభుత్వ స్కీం అమలు అయిన కానీ సైబర్ నేరగాళ్లు ఏపీకి లను వాట్సాప్ గ్రూపులలో పంపి తదనంతరం వాటిని హ్యాక్ చేసి ఆర్థికంగా దోచుకోవడం జరుగుతుంది. ఇలాంటి వాటి వల్ల ప్రజలు మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నారు.

**వాట్సప్ లలో వచ్చే లింకులతో అప్రమత్తంగా ఉండాలి...**

**బత్తుల సత్యనారాయణ, సీఐ, ఇల్లందు**




వాట్సాప్ గ్రూపులలో పిఎం కిసాన్ ఏపీకే యాప్ లు చెక్కర్లు కొడుతున్నాయని, వాటి వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లో ఆ లింకులను ఓపెన్, ఇన్స్టాల్ చేయవద్దు. సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త ఐడియాలతో వస్తున్నారని ఆలోచించాలి. సైబర్ కేటుగాళ్ల మాయలో పడి ఆర్థికంగా నష్టపోవద్దు. సైబర్ నెల పట్ల ప్రజలకు అవగాహన కల్పించిన గాని ఎక్కడో ఒక దగ్గర మోసపోతూనే ఉన్నారు.

# భవిష్యత్ బీఆర్ఎస్ దే మాజీ ఎమ్మెల్యే రేగా





**భద్రాచలం,నవంబర్ 3, ప్రజాజ్యోతి:**

భవిష్యతు బీఆర్ఎస్ దే అని ,పార్టీని క్షేత్రస్థాయిలోకితీసుకెళ్లి,అమలుకానీ కాంగ్రెస్ గ్యారంటీలు ప్రజలకు అర్థమయ్యేలా కార్యకర్తలు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు .ఆదివారం భద్రాచలం లో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడుతూ... అమలుకు సాధ్యం కాని కాంగ్రెస్ గ్యారంటీ హామీలు అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఎటువంటి సందేహం లేకుండా భవిష్యత్తులో అధికారం లోకి వచ్చేది బిఆర్ఎస్ పార్టీనే అని అన్నారు.భద్రాచలం మండలంలో ప్రతి వార్డులో బిఆర్ఎస్ కమిటీ వేసి క్షేత్రస్థాయిలో పార్టీనిర్మాణంచేయాలని ,భవిష్యత్తు బిఆర్ఎస్ దే కార్యకర్తలు, నాయకులు మరింతగా ప్రజలలో ముందుకు పోవాలని చెప్పారు.ఈ సమావేశంలో నియోజకవర్గ మాజీ ఇంచార్జి మానే రామకృష్ణ,కోటగిరి ప్రభోద్ కుమార్, ఆకోజు సునీల్ కుమార్, కోలా రాజు,ఉడతా రమేష్,రేపాక పూర్ణచంద్రరావు,అంబటి కర్ర కృష్ణ ,పడిసిరి శ్రీనివాసరావు,కొల్లం ప్రేమ్ కుమార్, బాసిబోయిన మోహన్ రావు,కావూరి సీతామహాలక్ష్మి ,పూజల లక్ష్మి,కాపుల సూరిబాబు ,అనీల్,ఏడుకొండలు,ప్రసాద్, రమేష్, యువరాజు,నరసింహులు ,శివ, గణేష్ ,నాగరాజు ,సలోమీ,రాణి,ప్రియాంక,ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వితీయ సోపాన టెస్టింగ్ క్యాంప్ నిర్వహణ





**ఇల్లందు, నవంబర్ 3, ప్రజాజ్యోతి:**

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా సింగరేణి పాఠశాల ఆధ్వర్యంలో జెకె కాలనీ సిఈఆర్ క్లబ్ లో ఆదివారం స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వితీయ సోపాన టెస్టింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జియం జాన్ ఆనంద్ మాట్లాడుతూ ఈనెల 3 నుంచి 5వరకు స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వితీయ సోపాన టెస్టింగ్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా బాల బాలికలలో దేశభక్తిని, క్రమశిక్షణను పెంపొందించి వారిని సమాజ సేవకులుగా తీర్చిదిద్దడానికి ప్రారంభించబడిన ఉద్యమమని, ఈ ఉద్యమంలో బాలుర బృందాలను స్కౌట్స్, బాలికల బృందాలను గైడ్స్ అని అంటారన్నారు. ఈ ఉద్యమాన్ని సర్ రాబర్ట్ బెడన్ పవల్ దక్షిణాఫ్రికాలో జరిగిన బోయర్ యుద్ధాలలో గాయపడిన వారికి సేవచేయడానికి ప్రారంభించాడని తెలిపారు. ఇందులో చేరిన పిల్లలకు సేవా పద్ధతులను అనుసరించి శిక్షణ ఇస్తారని, వీరికి ఈతకొట్టడం, వంతెనలు, రోడ్ల నిర్మాణం, ప్రథమ చికిత్స పద్ధతులను నేర్పుతారని పేర్కొన్నారు. ఆయుధాలు లేకుండా వీరు కేవలం ఒక కర్రను మాత్రమే ధరిస్తారని, వీరికి సైనికుల మాదిరిగా ప్రత్యేక దుస్తులు మెడలో ఒక స్కార్ఫ్ ఉంటుందని, ఇందులో చేరినవారు దళాలుగా ఏర్పడతారన్నారు. ప్రతి దళానికి ఒక పతాకం, వాయిద్యాలు ఉంటాయని, సదా సమాజసేవలో ఉంటాం అనే నినాదం ఈ పతాకంపై రాసి ఉంటుందని తెలిపారు. ఈ ఉద్యమంలో విద్యార్థులందరూ స్వచ్ఛందంగా చేరాలని, సత్యం పలకడం, కష్టాలలో ఉన్నవారిని ఆదుకోవడం, రోగగ్రస్తులకు సేవచేయడం, పోలీసు వ్యవస్థకు అత్యవసర సమయాల్లో సాయపడటం స్కౌట్స్ అండ్ గైడ్స్ ద్వారా సమాజ సేవ చేయవచ్చన్నారు.వివిధ ఏరియాల నుండి వచ్చిన విద్యార్థులు,గైడ్ టీచర్స్ కు ఈ మూడు రోజులపాటు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిజియం (పర్సనల్) జివి. మోహన్ రావు, సీనియర్ పర్సనల్ అధికారి సాయి స్వరూప్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, స్కౌట్స్ అండ్ గైడ్స్ టీచర్స్ సంగాల సుధాకర్, సాయి నిరంజన్, అశోక్, వివిధ ఏరియాల గైడ్ టీచర్స్ పాల్గొన్నారు.

# టిఎన్టియుసి ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం

**బూర్గంపహాడ్, నవంబర్3, ప్రజాజ్యోతి:**

తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సారపాక ప్రధాన కూడలి వద్ద పినపాక నియోజకవర్గం బూర్గంపాడు మండల తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమము నిర్వహించారు. కాగా తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ఐటీసీ టిఎన్టియుసి నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిఎన్టియుసి ఐటిసి కార్మిక సంఘం అధ్యక్షులు కనకమెడల హరిప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ పూర్వవైభవం తెచ్చేలా సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సమన్వయకర్త పోటు రంగారావు,బూర్గంపాడు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు శ్రీ తాళ్లూరి జగదీశ్వర్ రావు,నాయకులు రాష్ట్ర ప్రచార కార్యదర్శి గల్లా నాగ భూషయ్య, స్టేట్ పబ్లిసిటీ కార్యదర్శి చావా మహేశ్వరరావు ,ఐటీసీ టిఎన్టియుసి నాయకులు కనకమేడల హరిప్రసాద్, ముక్కు జీవన్ రెడ్డి,సంజీవరావు,కొండలరావు,చావా వేణు,కుందేటి శ్రీనివాస్, కాకర్లమౌళి,చావారవి,మండలజిల్లా నాయకులు నెట్టెం భాస్కర్ రావు,కాకర్లసత్యనారాయణ,కంచేటీ వెంకటేశ్వరరావు,నెట్టెం చలపతిరావు,బూర్గంపాడు మండల మరియు జిల్లా తెలుగుదేశం పార్టీ అభిమానులు నాయకులు తెలుగుయువత మరియు ఐటీసీ టిఎన్టియూసి నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.



## పాషా కుటుంబానికి డెకరేషన్ అసోసియేషన్ ఆర్థిక సాయం



**ఇల్లందు, నవంబర్ 3, ప్రజాజ్యోతి:**

ఆర్.కె సౌండ్ సిస్టమ్ నిర్వాహకుడు పాషా కొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం ఇల్లందు డెకరేషన్ యూనియన్ సభ్యులు పాషా తల్లికి రూ. 10వేల ఆర్థిక సాయం అందజేశారు. డెకరేషన్ యూనియన్ సభ్యులు మాట్లాడుతూ తమ యూనియన్ ద్వారా రూ. 50 వేలను పాషా కుటుంబానికి ఇవ్వడం జరుగుతుందన్నారు. మొదటగా రూ. 10వేలు ఇచ్చామని, మిగిలిన రూ. 40 వేలను పాషా 40 రోజుల కార్యక్రమానికి అందజేస్తామని పేర్కొన్నారు. డెకరేషన్ యూనియన్ లో ఎవరికీ ఆపద వచ్చిన ఆదుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డెకరేషన్ యూనియన్ అధ్యక్షుడు సామల రవితేజ,సభ్యులు పోసనపల్లి కృష్ణ, సతీష్, రమేష్, సురేష్, మధు, కళ్యాణ్, ఫణి, ఓమ్ రమేష్, మోహన్ రావు, వల్లాల నర్సయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే



**భద్రాచలం, నవంబర్ 3, ప్రజాజ్యోతి:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా డిఎస్సిలో నూతనంగా కొలువులు సాధించిన ఉపాధ్యాయులను ఆదివారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు ఘనంగా సన్మానించారు . స్థానిక ఎంపీ కాలనీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట రావు ముఖ్యఅతిథిగా పాల్గొని పోలిశెట్టి సురేష్ బాబు, పోలిశెట్టి సాయిరాం కృష్ణ, పావురాల వినోద్ కృష్ణలకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ ఘనసత్కారం నిర్వహించారు .భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట రావు మాట్లాడుతూ పట్టుదల కృషి ఉంటే దేనినైనా సాధించవచ్చు అని, ఏదైనా లక్ష్యం ఏర్పాటు చేసుకుని దాని దిశగా మనం పయనించినట్లయితే ఆ లక్ష్యాన్ని చేరుకోవచ్చని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీ కాలనీ యూత్ సభ్యులు,స్థానిక మండల నాయకులు నక్కా ప్రసాద్, రజనీ టాప్ రాము,యువజన నాయకులు యం.డి నవాబ్, మల్లెలలోకేష్,విజయ్,ప్రేమ పార్టీ నాయకులు, కార్యకర్తలు,సోషల్ మీడియా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు ఘనంగా నిత్య కల్యాణం

**భద్రాచలం టౌన్, నవంబర్ 3, ప్రజాజ్యోతి:**

శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారంభద్రాద్రి రామయ్యకు ఘనంగా నిత్యకల్యాణం నిర్వహించారు . తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ,అభిషేకం ఆరాధన, ఆరగింపు నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు జరిపారు. స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు.ఆదివారం సెలవు దినం కావటంతో భక్తులు అధిక సంఖ్యలో కల్యాణంలో పాల్గొన్నదాతలకు శేషవస్త్రాలు,స్వామివారి ప్రసాదాలు అందజేశారు.



## జెకె కాలనీ డిస్పెన్సరీని ఆకస్మికంగా తనిఖీ చేసిన జీఎం



**ఇల్లందు, నవంబర్ 3, ప్రజాజ్యోతి:**

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జెకె కాలనీలోని సింగరేణి డిస్పెన్సరీనీ ఆదివారం ఏరియా జాన్ ఆనంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.జాన్ ఆనంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్ లోని రోగులకు అందుతున్న వైద్యం వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.జియం మాట్లాడుతూ అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చే వారితో ఆప్యాయంగా మాట్లాడాలని, వారికీ మెరుగైన వైద్య సేవలు అందించాలని, జెకె కాలనీలోని డిస్పెన్సరీ ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు,వారికుటుంబాలమహిళలకు అందుబాటులో ఉండేలాడాక్టర్లనునియమించడం జరిగిందన్నారు. వైద్యం కోసం వచ్చే వారికీ తప్పనిసరిగా శరీర ఉష్ణోగ్రతలను చూడాలని, వారికీ అందించే వైద్య సేవలలో ఎలాంటి అంతరాయం ఏర్పడిన సంబందిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.డిస్పెన్సరీనందు మరింత మెరుగైనవసతులు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిజియం (పర్సనల్) జివి. మోహన్ రావు, ఇతర అధికారులు, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

## అసంపూర్తి డ్రైనేజీ నిర్మాణం పూర్తి చేయాలి



**బూర్గంపహాడ్, నవంబర్ 3, ప్రజా జ్యోతి:**

బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక రాజీవ్ నగర్ కాలనీలోని సాయిరాం స్కూల్ ప్రక్క వీధిలో అసంపూర్తిగా డ్రైనేజీను నిర్మించి వదిలేయడంతో కాలనీవాసులు డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని పంచాయతీ అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం అసంపూర్తిగా నిర్మించి ఉన్న డ్రైనేజీ ప్రాంతం వద్ద కాలనీవాసులు ప్రజాప్రతినిధులు కలిసి పంచాయతీ అధికారులకు సమస్యను తెలుపుతూ ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో డ్రైనేజీ పూర్తిగా నిర్వహించాల్సి ఉండగా అసంపూర్తిగా వదిలేయడంతో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుందని తెలిపారు.అంతేకాకుండా వర్షం వస్తే తమ ఇళ్ళ పరిసరాల్లోకి వరద నీరు వస్తుందని ఆరోపించారు.ఇకనైనా పంచాయతీ అధికారులు దృష్టిసారించి డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.గార్లపాటి శంకర్,కనితి కృష్ణ,ఈశ్వర్,ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.


# ఆలయాల్లో... కార్తీకమాస శోభ



**భక్తులతో కిటకిటలాడనున్న శైవ క్షేత్రాలు**

**కార్తీక దామోదర అని కీర్తించిన శుభ ఫలితాలు లభిస్తాయని భక్తుల విశ్వాసం**

**నేడు కార్తీక మాస తొలి సోమవారం**





**అశ్వారావుపేట, నవంబర్ 3, ప్రజాజ్యోతి:**

కార్తీక మాసం ప్రారంభమైంది. నియోజకవర్గ వ్యాప్తంగా ఆలయాల్లో కార్తీక మాసం శోభ సంతరించుకుంది. కార్తీక మాసం సందర్భంగా ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.కార్తీకమాసం అన్నిమాసాలలో కెల్లా ఉత్తమమైన మాసంగా పరిగణించబడుతుంది. ఈ మాసంలో భక్తులు శివకేశవులను పూజిస్తారు. సూర్యోదయానికి ముందు బ్రహ్మ ముహూర్తంలో అభ్యంగన స్నానం చేస్తారు. కార్తీక మాసంలో దీపం వెలిగించడం ఎంతో పుణ్యప్రదమని భక్తుల నమ్మకం. ఈ మాసంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడనున్నాయి. పురాణాల ప్రకారం ఈ మాసం శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైనది. నెల రోజులు పూజ చేసిన ముఖ్యంగా సోమవారం ఉపవాసం ఉండి అత్యంత భక్తి శ్రద్ధలతో శివయ్యను భక్తులు కొలుస్తారు కొంతమంది సాయంత్రం నక్షత్ర దర్శనం అనంతరం ఆ ముక్కంటేశ్వరుడికి పూజ చేసి ఉపవాస దీక్ష విరమిస్తారు.కార్తీక మాసంలో చేసే స్నానం, దీపం, పూజ, దానం విశిష్ట ఫలితాలను ఇస్తాయని నమ్మకం. శివ శివ అంటూ నామస్మరణ, చేసినా.. కార్తీక దామోదర అం టూ కీర్తించినా శుభ ఫలితాలు లభిస్తాయని విశ్వాసం. ముఖ్యంగా కార్తీక మా సంలో శివ నామస్మరణ, పూజ అత్యం త ఫలవంతం.సోమవారం చేసే స్నానం, పూజ, జపం ఆచరించినవారు అశ్వమేథ యాగం చేసిన ఫలితం పొం దుతారని విశ్వాసం. అయితే కార్తీక మాసంలో సోమవారానికి ఎంతో విశిష్టత ఉంది.

**కార్తీకమాస విశిష్టత....**

కార్తీకమాసం మహత్యం గురించి మొదటిగా విశిష్ట మహర్షి జనకమహారాజుకు వివరించినట్లు పురాణ ఇతిహాసాల ద్వారా తెలుస్తుంది. వశిష్ట మహర్షి జనక మహారాజులకు వివరించగా శౌలతాది మునులకు సుతుడు వివరించినట్లు తెలుస్తుంది. ఈ నెలలో ప్రతి రోజు పుణ్యప్రదమైనదే ..రోజు చేసే స్నానం, అర్చనలు, అభిషేకాలు, విశిష్టమైనవి నదీ స్నానం, ఉపవాసం, దీపారాధన, దీపదానం, సాలగ్రామ పూజ, వన మహోత్సవ వేడుకలు ఇలా భక్తులు అనేక విధాలుగా శివకేశవుల్ని ఆరాధిస్తూ ఆచరిస్తారు. శ్రీకృష్ణుడు కూడా ఈ నెలలో శివకేశవులను పూజించి తులసి కళ్యాణం జరిపించారని తద్వారా అత్యంత పుణ్యఫలం ప్రాప్తిస్తుందని భక్తుల విశ్వాసం.

**కార్తీకమాస సోమవారం ఉపవాసం ఎలా చేయాలంటే...**

కార్తీక సోమవారం సూర్యోదయానికి ముందే శివాలయానికి వెళ్లి శివునికి అభిషేకం చేసి ఉపవాసం ఉండాలి సాయంత్రం ప్రదోషకాల సమయంలో ఇంటిలోని పూజా గదిలో దీపారాధన చేసి నక్షత్ర దర్శనం అనంతరం శివాలయానికి వెళ్లి ఆ పరమేశ్వరుని దర్శించుకుని ఆలయంలో దీపారాధన చేసి ఓం నమశ్శివాయ పంచాక్షరి మంత్రాన్ని పఠించాలి. ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలను పూర్తి చేసి అనంతరం భోజనం చేసి ఉపవాస దీక్షలో విరమించుకోవాలి ఇలా చేయడం వలన ఎంతో పుణ్యఫలం లభిస్తుందని భక్తుల నమ్మకం.

# డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు పట్ల హర్షం

**భద్రాచలం, నవంబర్ 3, ప్రజాజ్యోతి :**


తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన గురుకులాలలో డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు గతంలో ఉన్న వాటికంటే 40 శాతం అదనంగా చార్జీలు పెంచుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయటం పట్ల భద్రాచలం గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఎ.పద్మావతి, కళాశాల స్టాప్, సిబ్బంది, స్టూడెంట్స్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పేద విద్యార్థిని, విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తుందని ప్రిన్సిపాల్ ఏ పద్మావతి పేర్కొన్నారు. ఇంకా చక్కని మెనూ అమలు చేసేందుకు అవకాశం ఏర్పడిందని తెలిపారు. ఇటువంటి అవకాశాలను బాలబాలికలు సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదువుకోవాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం శ్రీ మల్లు బట్టి విక్రమార్క, గిరిజన గురుకులాల ప్రిన్సిపల్ సెక్రెటరీ ఏ శరత్ , సెక్రటరీ శ్రీమతి సీతాలక్ష్మి , ఉన్నతాధికారులకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు.



## జవాన్లపై దాడి

**చర్ల, నవంబర్ 3, ప్రజా జ్యోతి:**

చత్తిషుఘడ్ రాష్ట్రం, సుక్మా జిల్లా, జాగురుగుండ వీక్లీ మార్కెట్లో విధులు నిర్వహిస్తున్న జవాన్లపై నక్సల్స్ దాడి చేశారు. విధులు నిర్వహిస్తున్న ఇద్దరు జవాన్లపై నక్సలైట్ల చిన్న యాక్షన్ టీమ్ దాడి చేసింది. ఈ దాడిలో ఇద్దరు జవాన్లలు గాయపడినట్లు , గాయపడిన జవాన్లకు జాగురుగొండ ఆస్పత్రిలో చికిత్స కొనసాగుతుంది, మార్కెట్లో గందరగోళం నెలకొనడంతో పోలీసులు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. గాయపడిన జవాన్ల పేర్లు కరాటం దేవా, సోది కన్న, ఇద్దరు జవాన్ల ఆయుధాలను నక్సలైట్లు దోచుకున్నారని ఎస్పీ కిరణ్ చావన్ ధ్రువీకరించారు.







## సిసిఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

**★ క్వింటా పత్తికి రూ. 8 వేలు ఇవ్వాలి. ★ సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు.**




**టేకులపల్లి, నవంబర్ 3, ప్రజాజ్యోతి:** మండలంలో అందుగులగూడెం గ్రామంలో సిపిఎం మండల కమిటీ సమావేశం సిసిఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి పత్తి కొనుగోలు చేయాలని,క్వింటాలుకు 8వేల రూపాయలు గిట్టుబాటు ధరను ఇవ్వాలి అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జె. రమేష్,జిల్లా కమిటీ సభ్యుడు రేపాకుల శ్రీనివాస్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నాడు మాట్లాడుతూ మండలంలో పత్తి రైతులకు గిట్టుబాటు ధర లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు, తేమ శాతం పేరుతో దర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. పది వేల ఎకరాల భూముల్లో పత్తిపంట పండిస్తున్న దాని సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు.మండలంలో జాతీయ రహదారి లో భూములు కోల్పోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అని అన్నారు.బహిరంగ మార్కెట్లో ఉన్న విధంగా భూముల ధరలు పదిలక్షల రూపాయలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఈసం నరసింహారావు,మండల కమిటీ సభ్యులు కడుదుల వీరన్న,పూనెం స్వామి,కుంజ రమేష్,పూనెం చంద్రశేఖర్, దొడ్డ సావిత్రి,దనసర వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# షటిల్ ఇండోర్ స్టేడియం ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాందాస్

**జూలూరుపాడు, నవంబర్ 3 ప్రజాజ్యోతి**




జూలూరుపాడులో కల్లోజి పాపయ్య జ్ఞాపకార్థ వారి కుమారులు ఆధ్వర్యంలో నిర్మించిన పిఆర్ షటిల్ ఇండోర్ స్టేడియంను ప్రారంభించిన ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు ఏజెన్సీ మండలంలో ఉన్న యూవతకు ఎంతగానో ఉపయోగంగ ఉంటుందని, దీనిని అందరూ ఉపయోగించుకుంటే మంచిదని, 20 లక్షలు స్టేడియం ఏర్పాటు చేయడం గొప్ప విషయం అని. షటిల్ కోర్టునునిర్మించినకాల్లోజిబ్రదర్స్ కి ప్రత్యేకధన్యవాదములు అని చెప్పటం జరిగింది. అనంతరం ఎమ్మెల్యేను కల్లుజి కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారుఈ కార్యక్రమం లో జూలూరుపాడు స్.ఐ. రానా ప్రతాప్ మరియు జిల్లా నాయకులు, లేళ్ళ. వెంకటరెడ్డి మరియు మండల అధ్యక్షులు మాలోత్. మంగీలాల్ దుద్దుకూరు మధుసూదన్ రావు, లకావత్. లచ్చు నాయక్ కోటేశ్వర రావు వివిధ నాయకులు పాల్గొన్నారు.

# రూ. 22 వేల కోట్లు పక్క దారి పట్టించిన ఓ మాజీ మంత్రి

**ఇల్లందు, నవంబర్ 3, ప్రజాజ్యోతి:**

హరితహారం కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం అందజేసే రూ. 22 వేల కోట్లను మాజీ మంత్రి హరీష్ రావు అధికారుల సహకారంతో పక్కదారి పట్టించడం జరిగిందని మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ ఆరోపించారు. ఆదివారం ఇల్లందు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ హరితహారానికి సంబంధించిన కేంద్ర ప్రభుత్వం నిధులైన రూ. 22 వేల కోట్లు పక్కదారి పట్టిందని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. దానికి సంబంధించిన ఫైల్ ఫైనాన్స్ డిపార్ట్మెంట్లో ఉందని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు 40 శాతం స్టైఫెండ్ పెంచడం సంతోషకరమని, అందుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేసి తీరుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే చేతుల ప్రభుత్వమని స్పష్టం చేశారు.



తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కెసిఆర్ అసలు పోరాడలేదని, పార్లమెంట్ లో తెలంగాణ బిల్లు పెట్టిన రోజు ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు.

# ప్లంబర్ సురేష్ కుటుంబానికి అండగా జగదాంబ ఎలక్ట్రికల్ షాప్, ఎలక్ట్రిషన్స్ యూనియన్



**బూర్గంపహాడ్, నవంబర్ 3, ప్రజా జ్యోతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీ నగర్ గ్రామానికి చెందిన బసై సురేష్ ప్లంబరు వృత్తి చేసుకుంటూ అనారోగ్యంతో గత నెలలో మృతి చెందిన విషయం విధితమే. కాగా విషయం తెలుసుకున్న జగదాంబ ఎలక్ట్రికల్ యజమాని అశోక్ తన వంతు సహాయంగా దశ దిన కర్మలకు ఆర్థిక సహకారం అందించారు. తోటి ఎలక్ట్రిషన్స్ తమ యూనియన్ ద్వారా 35 వేల రూపాయలు కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎలక్ట్రిషన్స్, ప్లంబర్లు ఎటువంటి అనారోగ్యానికి గురైనా తమ షాపు ద్వారా సహాయ సహకారాలు అందించనున్నట్లు అశోక్ తెలిపారు. ఎలక్ట్రిషన్స్ యూనియన్ సభ్యులు మాట్లాడుతూ ఇంతకాలం తమతో కలిసి పని చేసిన సురేష్ మరణవార్త బాధాకరమని అన్నారు. కుటుంబంలో ఏ అవసరత ఉన్న యూనియన్ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిషన్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చుక్క సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి బాబ్జి, నాయకులు మండల అధ్యక్షులు కడారి కృష్ణ ఉపాధ్యక్షులు రజాక్, ఆకుల రఘు, కోశాధికారి తామరపల్లి పాండు, సాయి కార్యదర్శులు దారా దినేష్ సభ్యులు మోతిలాల్ మహేష్ హనుమంతరావు చైతన్య రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సురేష్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా ప్లంబర్ గా పనిచేస్తూ మృతి చెందిన సురేష్ కుటుంబానికి అండగా నిలబడ్డ జగదాంబ ఎలక్ట్రిషన్ షాపు యాజమాన్యానికి యూనియన్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం... ఫిర్యాదు చేసిన భార్య

**చంద్రుగొండ, నవంబర్ 3, ప్రజాజ్యోతి:**



వ్యక్తి అదృశ్యం కావడంతో భార్య స్థానిక పోలీస్ స్టేషన్లో ఆదివారం ఫిర్యాదు చేసింది. చంద్రుగొండలో హమాలీ పని చేస్తున్న బడుగు చిన్న ఎల్లయ్య అదృశ్యం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ మంచినీళ్ల ఆదినారాయణ విలేకరులకు తెలిపారు. గత నెల 31న మద్యం సేవించి ఇంటికి వెళ్ళగా భార్య పార్వతి ఇలా తాగి వస్తే మన కుటుంబం ఎలా బాగుపడుతుందని అనడంతో అతను ఇంటి నుంచి తిరిగి వెళ్లి పోవడంతో బంధువులకు స్నేహితులకు సమాచారం అందించి అతని కోసం వెతికారు. బడుగు చిన్న ఎల్లయ్య ఆచూకీ తెలియకపోవడంతో భార్య బడుగు పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఆదినారాయణ తెలిపారు.

## భక్తులతో నిండిన భద్రగిరి

**భద్రాచలం టౌన్, నవంబర్ 3, ప్రజా జ్యోతి:**

పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలం రామాలయంలో భక్తుల సందడి నెలకొంది . ఆదివారం సెలవు దినం కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో భద్రాచలం తరలివచ్చారు. అర్చకులు ముందుగా ఉదయం స్వామి వారికి అభిషేకం, బంగారు పుష్పము తో అర్చన, పుణ్యవచనం తదితర నిత్య పూజలు నిర్వహించరు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు ముందుగా భద్రాచలం పవిత్ర గోదావరి నదిలో స్నానం ఆచరించి గోదావరి నది వద్ద కార్తీకదీపలు వెలిగించి అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్నారు . అనుబంధ దేవాలయాలైన అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయంలో కూడా భక్తులతో నిండిపోయింది. భక్తులు అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు . సాయంత్రం బ్రహ్మశ్రీ సన్యాసి శర్మ వారిచే కార్తీక పురాణ ప్రవచనం, భద్రాచలం వాస్తవ్యులు శ్రీమతి లలిత బృందం వారిచే భక్తి సంగీత కార్యక్రమం అనంతరం శ్రీమతి వరలక్ష్మి శిష్య బృందం వారిచే నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు

## నేడు ఐటీడీఏలో గిరిజన దర్బార్

**భద్రాచలం, నవంబర్ 3, ప్రజాజ్యోతి:**



భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం తెలిపారు. ఈ గిరిజన దర్బార్ 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో జరుగుతుందని, అన్నిశాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని తెలిపారు. గిరిజనులు వారి సమస్యలకు సంబంధించి అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందజేయాలని తెలిపారు.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్ళ పంపిణి



**భద్రాచలం టౌన్, నవంబర్ 3, ప్రజాజ్యోతి :**

రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం వారి ఆధ్వర్యంలో విద్యార్థినులకి రూ.32000 విలువ చేసే 5 సైకిల్స్ ఆదివారం పంపిణి చేసారు . రోటరీ క్లబ్ అధ్యక్షుడు దార బాలాజీ, సభ్యులు విద్యార్థినులకి అందచేయటం జరిగింది . అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం అధ్యక్షుడు దార బాలాజీ మాట్లాడుతూ భద్రాచలం రోటరీ క్లబ్ , రోటరీ క్లబ్ హైదరాబాద్ నార్త్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఈ కార్యక్రమం చేయటం జరిగిందని అన్నారు . ఈ కార్యక్రమంలో కార్యదర్శి విద్యాసాగర్, కోశాధికారి శ్రీనివాస్, ఇమ్మిడియేట్ పాస్ట్ ప్రెసిడెంట్ శ్రీ మహాలక్ష్మి, ప్రెసిడెంట్ ఎలెక్ట్ పలివెల రవి కుమార్, ప్రోగ్రాం చైర్మన్ ప్రభాకర్ గుప్త ,పాస్ట్ ప్రెసిడెంట్స్ యశోద రాంబాబు, మునికేశవ్, రఫీ, మధు, బ్రహ్మ రెడ్డి, వసంతరావు, రాజారెడ్డి, చైతన్య, వైస్ ప్రెసిడెంట్ అజీమ్, చలపతి, శ్రీధర్ రెడ్డి, సాంబశివ రావు, బందు నరసింహ రావు, పాషా, శేషుకుమార్, వెంకటేశ్వర్లు, గ్లాడ్ స్టోన్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడిగా లింగయ్య



**చంద్రుగొండ, నవంబర్ 3, ప్రజాజ్యోతి:**

తెలంగాణ మలిదశ ఉద్యమకారుల చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల మండల అధ్యక్షుడుగా గాదె లింగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మలిదశ ఉద్యమకారులు సమావేశమై సంఘ కార్యదర్శులు గా జాఫర్, ఉపాధ్యక్షులు గా హరీష్, కోశాధికారిగా ఎస్కే అన్వర్, సహాయ కార్యదర్శిగా ఎండి జాకీర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వరికుటి వెంకటరావు తదితరులతోపాటు కార్యవర్గం సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. 5000 రూపాయల పింఛన్, ఇంటి స్థలం ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు, ఉద్యమకారులకు 10 లక్షల ఇన్సూరెన్స్ బీమా, ఆర్టీసీ బస్సుల లో ఉచిత ప్రయాణం , ఉద్యమకారుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు.